వ్యాయామంతో పరిపూర్ణ ఆరోగ్యం


వీఎస్‌టీలోని పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రోజూ వ్యాయామం చేసేవారు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని... వ్యాయామం ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం వీఎస్‌టీ జంక్షన్‌లోని పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ... తన రాజకీయ ఎదుగుదలకు సహకరించిన ముషీరాబాద్ ప్రజలకు నేను ఎంతో రుణపడి ఉన్నానని ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఎంపిగా ఎన్నికైనా ఇక్కడి ప్రజల అభివృద్ధి కోసం తన శక్తివంచెన లేకుండా కృషి చేస్తానన్నారు. అందుకే ఎంపి నిధుల నుంచి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లను కై వసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పూసరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు సి.పార్థసారథి, జైపాల్‌రెడ్డి, బెజవాడ రవీందర్, రమేష్‌రాం, కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యం కావాలి


మాట్లాడుతున్న గారె వెంకటేష్‌మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మాదిగ, మాదిగ ఉపకులాలు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి(టీఎంపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్‌మాదిగ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని కులాలను గుర్తించి ఆయా కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. మాదిగ, మాదిగ ఉపకులాల కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ. 30 వేల కోట్లు నిధులు మంజూరు చేసి వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో మాదిగ భవిష్యత్తు, కార్యాచరణ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాదిగలు అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి ఎర్ర రాంచందర్, మహిళా అధ్యక్షులు బొర్ర సంపూర్ణ, ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, కోఆర్డినేటర్ మేకల అనిత, తారా, శ్రీశైలం పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలి


పుస్తకాలను అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, జస్టిస్ చంద్రకుమార్, టీవైఆర్ రాజు, పద్మజ

చిక్కడపల్లి: టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టి.రాజు ఆధ్వర్యంలో గురువారం రూ. లక్ష విలువచేసే పుస్తకాలు, అల్మారాను చిక్కడపల్లి నగర గ్రంథాలయ సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయలని ఆయన అన్నారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ... విలువల కోసం బతికే వారికి ఎప్పటికీ మన్నన ఉంటుందని, టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టి.రాజు అలాంటి కోవాలో వస్తారన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల జనార్దన్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర కేంద్ర గ్రంథాలయం సంస్థ కార్యదర్శి పి.పద్మజ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మాస్టర్‌జీ, ఫౌండేషన్ వైస్ చైర్మన్ టి.ప్రభావతి, ప్రధాన కార్యదర్శి టి.రాహుల్, సభ్యుడు రోహిత్, నందగోపాల్, విజయలక్ష్మీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సమయాత్తం కావాలి


అభివాదం చేస్తున్న సంయుక్త కిసాన్‌మోర్చా నేతలు

కవాడిగూడ: కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలను ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్నదని వీటికి వ్యతిరేకంగా.. మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు బలమైన ఉద్యమం చేపట్టాలని కిసాన్ మోర్చా కన్వీనర్ టి. సాగర్ పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక చర్యలను నిరిసిస్తూ గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ... రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇస్తూ ప్రత్యేక చట్టం తీసుకురావాలని, రుణ మాఫీ చట్టాలు తీసుకురావాలని, విద్యుత్ సవరణ బిల్లును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పశ్య పద్మ మాట్లాడుతూ... మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేస్తే ఆహార వస్తువుల ధరలు పెరుగుతాయని నీతి అయోగ్ సభ్యులు దుష్ప్రచారం చేస్తున్నారని ఇది సత్య దూరం అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ రాయల చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు బి.వెంకట్, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్లు భిక్షపతి, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.కాంతయ్య, భూపాల్, సూర్యం, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


నృత్యం చేస్తున్న న్యాయ విద్యార్థినులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: న్యాయ విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని మాజీ మంత్రి, అంబేడ్కర్ విద్యా సంస్థల కార్యదర్శి జి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో జ్యూరీస్ జెనిసిస్ గాలా 2కే24 పేరుతో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వినోద్‌కుమార్ మాట్లాడుతూ... తమ కళాశాల నుంచి అనేక మంది న్యాయమూర్తులు కావడం గర్వకారణమన్నారు. న్యాయ విద్యార్థులు సమాజ హితం కోసం పేదలకు న్యాయం అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం న్యాయ విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో అలరించాయి. జాయింట్ సెక్రటరీ పి.వి.రమణకుమార్, అకాడమీ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్‌సీలో నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి

హిమాయత్‌నగర్: వేతన సవరణలో (పీఆర్‌సీ) నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం వేతన సవరణ సంఘాన్ని కోరింది. పెరిగిన ధరలు, జీవన వ్యయం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వేతన సవరణ సంఘం నాలుగో తరగతి ఉద్యోగులకు బేసిక్ పే రూ. 35 వేలు ఉండేటట్లు చూడాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తదితరుల నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి నాలుగో తరగతి ఉద్యోగుల ప్రతిపాదనలు అందచేశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు 51 శాతం ఫిట్ మెంట్ ప్రకటించాలని, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ పెంచాలని విన్నవించారు. సంఘం నేతలు దర్శా నాయక్, ఖాదర్ బిన్ హాసన్, కే. ధన్ రాజ్, బి.రాజేందర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో మోసం

హిమాయత్‌నగర్: పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని నమ్మించి ఓ మహిళను సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం నగరానికి చెందిన ఓ మహిళ(36)కి వాట్సాప్‌లో పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. ఈ లింక్ ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్లు సృష్టించిన వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ అయింది. అందులో వారు చెప్పిన విధంగా యూట్యూబ్ వీడియోలను ఎక్కువ మందితో లైక్, సబ్‌స్క్రైబ్ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. అనంతరం బాధితురాలిని టెలిగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ఇందులో తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో వారు చెప్పిన విధంగా విడతల వారిగా బాధిత మహిళ మొత్తం రూ.7,74,610 పెట్టుబడి పెట్టింది. అనంతరం ఆ డబ్బు తిరిగి విత్‌డ్రా కాకపోవడంతో మోసపోయానని బాధిత మహిళ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

అంబర్‌పేట ఫ్లైఓవర్ పూర్తయ్యేనా?

- ఆరేళ్లు గడిచినా కొనసా... గుతున్న పనులు
- కిలోమీటరున్నర ఫ్లైఓవర్ నిర్మాణానికి ఇంత సమయమా అంటూ విస్మయం
- జాతీయ రహదారిపై నిత్యం ఇబ్బంది పడుతున్న వాహనాదారులు, పాదచారులు


అంబర్‌పేటలో కొనసాగుతున్న ఒక వైపు ఫ్లైఓవర్

అంబర్‌పేట్: అంబర్‌పేట్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరేళ్లు గడిచినా ఇప్పటివరకు పూర్తికాలేదు. అంబర్‌పేట నడిబొడ్డున నిర్మించే ఫ్లైఓవర్ పనులు సుదీర్ఘంగా కాలంగా కొనసాగుతుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు నిత్యం నరకయాతనను అనుభవిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోల్నాక చర్చ్ నుంచి చే నంబర్ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తాల మీదుగా ఇరానీ హోటల్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుంది. కిలోమీటరున్నర మేర నిర్మించే ఫ్లైఓవర్ ఇరువైపుల ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- అంతేకాకుండా శ్రీరమణ చౌరస్తా నుంచి చే నంబర్ చౌరస్తా వరకు ఎనిమిది నెలల కాలంగా రాకపోకలు నిలిపివేయడంతో వాహనదారులు స్థానిక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

లక్ష్యం రెండేళ్లు.. ఆరేళ్లు గడిచినా...

- అంబర్‌పేటలో నిర్మించే ఫ్లైఓవర్‌ను ఆరేళ్ల క్రితం అప్పటి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ చేతుల మీదుగా ప్రారంభమైంది. 1.5 కిలో మీటర్ల పొడవుతో 47 పిల్లర్లతో ఫ్లైఓవర్ నిర్మించ తలపెట్టారు. రూ. 370 కోట్లతో ఈ ఫ్లైఓవర్ పనులను ప్రారంభించారు. ఇందులో 281 ఆస్తులను ఫ్లైఓవర్ కోసం సేకరించారు. ఆరేళ్లు గడుస్తున్నా ఫ్లైఓవర్ పనులు దాదాపు 60 నుంచి 70 శాతం పనులు మాత్రమే పూర్తి కావచ్చాయి. మిగిలిన 40 నుంచి 30 శాతం పనులు పూర్తి కావడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో అర్థం కాని పరిస్థితి ఉంది.

ట్రాఫిక్ ఇక్కట్లు.. తీవ్రం...

- అంబర్‌పేట్‌లో నిర్మించే ఫ్లైఓవర్ వరంగల్ జాతీయ రహదారి పై కావడంతో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణం సాగుతుండటంతో గత కొన్నేళ్లుగా వాహనాదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారికంగా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉండటంతో జిల్లాల నుంచి వచ్చే బస్సులతో పాటు స్థానిక బస్సులు, వాహనదారులు ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు విస్తరణకు నోచుకోకపోవడంతో అంబర్‌పేట రోడ్లపై వాహనం నడపడానికే ప్రజలు జంకుతున్నారు. ఉన్న ప్రత్యామ్నాయ రోడ్లను సైతం సరిగ్గా అందుబాటులోకి తేలేదు.

ఒకరిపై ఒకరు రాజకీయ ఆరోపణలు...

- ఫ్లైఓవర్ నిర్మాణం జాప్యంపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, బీజేపీలో ఉన్న కేంద్ర ప్రభుత్వ నేతలు ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణలో జాప్యం చేసిందని బీజేపీ నేతలు ఆరోపిస్తే... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అన్ని ఫ్లైఓవర్‌లు పూర్తి చేసిందని అంబర్‌పేట్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించే ఫ్లైఓవర్‌లో ఎందుకు జాప్యం జరుగుతుందని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. అంతే తప్ప సమన్వయంతో ఫ్లైఓవర్ నిర్మాణం సకాలంలో పూర్తి అయ్యేలా చొరవ తీసుకోకపోవడం గమనార్హం.

లోప్రెషర్‌తో తాగునీటి సరఫరాపై ఆందోళన

కాచిగూడ: మణియార్ పట్టిలో తాగునీటి సరఫరాలో ప్రెషర్ కారణంగా నీరు సరిగా రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, జలమండలి ఏఈ భావన, సిబ్బందితో కలిసి మణియార్ పట్టి ప్రాంతంలో పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. లోప్రెషర్ సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో పాటిల్, ప్రణయ్, ఆశీష్, రాజేందర్, రవి యాదవ్, రాములమ్మ, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పగిడి యాదగిరి సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: కృష్ణానగర్ బస్తీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి స్వర్గీయ పగిడి యాదగిరి అందించిన సేవలు చిరస్మరణీయమని కృష్ణానగర్ బస్తీ పంచ్‌కమిటీ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్ అన్నారు. కృష్ణానగర్ బస్తీ పంచ్ కమిటీ అధ్యక్షుడిగా పగిడి యాదగిరి అనేక సంవత్సరాల పాటు సేవలందించారని ఆయన తెలిపారు. పగిడి యాదగిరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం గోల్నాక డివిజన్, కృష్ణానగర్ లో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పి.విజయ్ కుమార్, బి.శ్రీధర్, పి.సత్యవీర్, సుదర్శన్, మహేష్, అకాష్, కార్తీక్, అభిరామ్, లడ్డూ, చిన్నూ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కాచిగూడ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హెచ్.నరేష్ సమాచారం మేరకు... నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన డి.శంకర్‌రావు భార్య డి.భాగ్‌రథ (43) ఇండ్లలో పనిచేస్తుంటుంది. కుమార్తె పెండ్లికి అవసరమైన డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఇంట్లో బాత్ రూమ్ క్లీనర్ తాగి ఆత్మహత్యకు ప్రయతించింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుమారుడు డి.గజానన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముషీరాబాద్ అభివృద్ధికి సహకరిస్తా

చిక్కడపల్లి: ముషీరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకరిస్తానని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ కమ్యూనిటీ హాల్‌లో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన నూతన పవర్‌బోర్‌ను ఆయన గురువారం గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌తో కలసి ప్రారంభించారు. బీజేపీ నేతలు పూసరాజు, వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, అశోక్‌నగర్ వెల్ఫేర్‌సెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, సుర్యప్రకాశ్, మూర్తి, సూర్యనారాయణ, శ్రీకాంత్, నందు, సురేందర్, నరేందర్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్ – జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (60) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రంలో బీజేపీకి అధికారం ఖాయం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: రాబోయే ఎన్నికల్లో 400కు పైగా పార్లమెంటు స్థానాలు గెలుచుకొని నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ 3వ సారి అధికారం చేపడుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐసీ కాలనీ, జలవాయువు టవర్స్‌లోని పార్కుల్లో సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరని, దేశ రక్షణ, సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 10కి పైగా పార్లమెంటు స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసి మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా


ఎస్‌బీహెచ్ కాలనీలో పార్కు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అన్నిరంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీలో ఉన్న పార్కులో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ యువజన రాష్ట్ర నాయకులు ముఠా జైసింహా, కాలనీ నాయకుడు సి. మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్.డి సాయికృష్ణ, నగర నాయకులు జి. రాజశేఖర్‌గౌడ్, వల్లాల రవియాదవ్, డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

సన్మానం



కోలుకున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులను సన్మానిస్తున్న డాక్టర్ సురేష్

ముషీరాబాద్: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో పేషెంట్ కనెక్ట్ ప్రోగ్రామ్‌ను గురువారం నిర్వహించారు. గతంలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న వారిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సురేష్ కిడ్నీ బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ జి.సూర్యప్రకాష్, హాస్పటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ నఫే, సిబ్బంది సతీష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఫిర్యాదు

బంజారాహిల్స్: షేక్‌పేట మండల పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ రోడ్డు నెంబర్–70 జర్నలిస్టుకాలనీ ఫేజ్–1లో కొంతకాలంగా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలానికి విముక్తి కలిగించాలంటూ ఫిలింనగర్‌కు చెందిన కాటూరి రమేష్ అనే వ్యక్తి గురువారం సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. తాను ఈ కబ్జాలపై జనవరి, ఫిబ్రవరి నెలల్లో రెండు సార్లు షేక్‌పేట తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశానని, ఆర్టీఐ కింద ఈ స్థలానికి సంబంధించి సమాచారం కోసం దరఖాస్తు కూడా చేసుకున్నానన్నారు. ఇంతవరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, చర్యలు కూడా తీసుకోలేదన్నారు. ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని, స్థలాన్ని కాపాడాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. జర్నలిస్టుకాలనీ ఫేజ్–1లో ఏ-3 నుంచి ఏ-9 వరకు ఉన్న ప్లాట్లకు ఆనుకుని కొండ ఉందని, ఆ కొండను తవ్వి ప్లాట్లు యజమానులు ఈ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారికి కేటాయించిన ప్లాట్ ఎన్ని గజాలు, ఇప్పుడు వారు ఉంటున్న ప్లాట్ ఎన్ని గజాలు ఉంటుందో విచారిస్తే పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన విషయాలు బయటకువస్తాయన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లనే ఖాళీగా ఉన్న ఈ స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు.

జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 ఏఎంహెచ్‌వోగా డాక్టర్ హేమలత


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసిన డాక్టర్ హేమలత

అంబర్‌పేట్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 ఏఎంహెచ్‌వోగా డాక్టర్ హేమలత బాధ్యతలు తీసుకున్నారు. రెండేళ్ల క్రితం ఆమె ఇదే సర్కిల్‌లో ఏఎంహెచ్‌వోగా బాధ్యతలు నిర్వహించి నీలోఫర్ పిల్లల ఆస్పత్రికి ఆర్ఎంవోగా బదిలీపై వెళ్లారు. తిరిగి ఆమె జీహెచ్ ఎంసీకి బదిలీపై వచ్చారు. గురువారం సర్కిల్–16 ఏఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిశారు. సర్కిల్–16 పరిధిలోకి వచ్చే అంబర్‌పేట నియోజకవర్గంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా విధులు నిర్వహిస్తానన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

గోరక్షణకు హైకోర్టు తీర్పును అమలు చేయాలి

కాచిగూడ: గోవుల రక్షణకు హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకామధేను గోవర్ధనగిరి గోవిజ్ఞాన సంధ్యా కేంద్రంలో గోవులకు పశుదాణాను అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... వేసవిలో గోశాలలకు, బయట తిరిగే గోవులకు, పశు పక్షాదులకు మంచినీటి వసతి, పశుదాణాను ప్రభుత్వం పంపిణీ చేసి ఆదుకోవాలని కోరారు. గో ప్రేమికుడు ప్రేమ్‌చంద్ మునోద్, లక్కరాజు మురళీధర్ రావు పాల్గొన్నారు.

ప్రేరణ పోస్టర్ ఆవిష్కరణ



ముషీరాబాద్: తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రేరణ పోస్టర్‌ను విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనితబ్రహ్మ పాల్గొని ఆవిష్కరించారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చదువుతున్న కామర్స్ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రేరణ అనే కార్యక్రమాన్ని కామర్స్ విద్యార్థులకు కళాశాల, యూనివర్సిటీ, రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలను, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్య, వైద్యంపై ఫోకస్ పెట్టండి

ముషీరాబాద్: ఉచితాలు, గ్యారంటీ పథకాలతో ప్రజలను మభ్య పెట్టకుండా విద్యా, వైద్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టాలని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ హితవుపలికారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను, భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్‌లో ఏర్పాటు చేసిన పవర్ బోర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రాం, కార్పొరేటర్ కె.రవిచారి, అసెంబ్లీ కోకన్వీనర్ నవీన్‌గౌడ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్, అనిల్‌కుమార్, నందు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నర్తకి వాసుకి దేవికి సన్మానం

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు భక్తి సంగీత కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తితో కలిసి ప్రముఖ సంగీత విద్వాంసురాలు, కథాకళి నర్తకి వాసుకి దేవిని శాలువాతో సన్మానించి సత్కరించారు. సంగీత విద్యాలయం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తి, ప్రముఖ సంగీత శిక్షకులు తేజస్విని, యశస్విని, సంగీత విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి


అవార్డు గ్రహీతలతో ప్రముఖులు

చిక్కడపల్లి: సాంస్కృతిక సంఘ సేవా సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో ఉమెన్ ఐకాన్ ఆఫ్ ద ఇయర్–2024 అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ప్రముఖులు హైమవతి భీమన్న , జ్యోతి కుకుమాను, వైఎస్ఆర్ మూర్తి, వీరభోగ వసంతరాయలు, ప్రార్థిని, సురేందర్, పుష్పలత పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీధర్

నల్లకుంట: ఉద్యోగ అన్వేషణ కోసం ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణ సమాచారం మేరకు... నిరుద్యోగి బి. శ్రీధర్(35) విద్యానగర్ దయానంద్ నగర్‌లో సోదరుడు శ్రీకాంత్‌తో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 13న మధ్యాహ్నం ఉద్యోగం చూసుకోవడానికి వెళుతున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు శ్రీధర్‌కు పలు మార్లు ఫోన్ చేసినప్పటికి స్పందన రాలేదు. దీంతో సోదరుడు శ్రీధర్ కనిపించడంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గృహ కార్మికులకు చట్టం రూపొందించాలి

పంజగుట్ట: గృహకార్మికుల, గార్బేజ్ కలెక్టర్లకు ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వీరిని గుర్తించి ఆదుకోవాలని ఆయన కోరారు. మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్ట్యూట్, గృహకార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టర్స్ కలెక్టివ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... సమాజంలో అవసరమైన వృత్తిలో కొనసాగుతున్న వీరికి కనీసం గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.